పెగడపల్లి సొసైటీ రైతులకు తీపి కబురు

- రుణమాఫీ నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్
- పీఏసీఎస్ చైర్మన్ ఒత్తిడి.. ఫలించిన ఎమ్మెల్యే ప్రయత్నం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


పెగడపల్లి సొసైటీ

హసన్‌పర్తి: పెగడపల్లి సొసైటీ రైతులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మూడు విడతల్లోనూ రుణమాఫీ కాని ఈ సొసైటీ పరిధిలోని రైతులకు రుణమాఫీ చేసింది. ఈమేరకు అందుకు సంబంధించిన నిధులను విడుదల చేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు వెల్లడించారు. త్వరలోనే అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

గతంలో ఒక్కరికే రుణమాఫీ

పెగడపల్లి సొసైటీ పరిధిలో నాగారం, ముచ్చర్ల, సీతానాగారం, పెగడపల్లి గ్రామాలు ఉన్నాయి. సొసైటీలో 1,012 మంది రైతులకు సభ్యత్వం ఉంది. ఈ సొసైటీ పరిధిలో సుమారు రూ.9.5 కోట్ల రుణం మాఫీ కావాల్సి ఉంది. మొదటి విడతలో రుణమాఫీ జాబితాలో పల్లం సతీష్‌కు మాత్రమే చోటు దక్కింది. వాణిజ్య బ్యాంక్‌కు అనుబంధంగా ఉన్న పెగడపల్లి సొసైటీ.. సరైన సమయంలో ఆడిట్ నివేదికను సమర్పించకపోవడంతోనే రుణమాఫీ వర్తించలేదు. దాంతో రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. సరైన సమయంలో ఆడిట్ నివేదిక నివేదించకపోవడం వల్ల సొసైటీ సీఈఓ యేసోబుపై అధికారులు వేటు వేశారు.

పీఏసీఎస్ చైర్మన్ ఒత్తిడి.. ఎమ్మెల్యే కృషి

సొసైటీ పరిధిలోని రైతులకు రుణమాఫీ కాకపోవడంపై సహకార సంఘం పాలకవర్గంపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేక వ్యక్తమైంది. దీంతో సొసైటీ చైర్మన్ చల్లా గోపాల్‌రెడ్డి పలుమార్లు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో పాటు ఉన్నతాధికారులపై తీవ్రంగా ఒత్తిడి తీసుకొచ్చారు. అనేకసార్లు ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి పరిస్థితిని వివరించారు. రాష్ట్ర మంత్రి తుమ్మ నాగేశ్వర్‌రావుతో పాటు వ్యవసాయ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే నాగరాజు రుణమాఫీ విషయపై చర్చించారు.

త్వరలోనే నిధులు విడుదల



పెగడపల్లి సొసైటీ పరిధిలోని రైతుల రుణమాఫీకి త్వరలోనే నిధులు విడుదలవుతాయి. అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ చేయడమే ప్రభుత్వ ధ్యేయం. రుణమాఫీ నిధుల విడుదలలో సొసైటీ చైర్మన్ కృషి ఎంతో ఉంది.

– కేఆర్.నాగరాజు, ఎమ్మెల్యే

పోటీతత్వంతో చదువుకోవాలి

- రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ


మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఖిలా వరంగల్ : విద్యార్థినులు లక్ష్యాన్ని ఎంచుకుని పోటీతత్వంతో చదువుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. ఈ మేరకు శనివారం వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ మహిళా కళాశాల, జ్యోతిబాపూలే గురుకులాన్ని కలెక్టర్ సత్యశారదతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, వంటగది, బియ్యం, పప్పు, కూరగాయలు నిల్వలను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అబ్బాయిల కంటే అమ్మాయిలే చదువులో ముందున్నారని చెప్పారు. గతంలో ఆడ పిల్లలను ఎక్కువ చదివిస్తే వాళ్లకు తగిన పెళ్లి సంబంధాలు వెతకడంలో ఇబ్బందులు పడేవారని, తల్లిదండ్రులు చదువును ప్రోత్సహించేవారు కాదని గుర్తు చేశారు. ఆధునిక కాలంలో ఆ సమస్య లేదని, ఉన్నతంగా చదివి తల్లిదండ్రుల గురువులు, తల్లిదండ్రుల ప్రతిష్ఠత పెంచాలని సూచించారు. అదేవిధంగా అద్దె భవనంలో కొనసాగుతున్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను సొంత భవనాల నిర్మాణం చేపట్టడానికి స్థలాన్ని పరిశీలించి నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వరరావు, ఆర్ఐ కీర్తన్, ఆర్‌సీఓ అపర్ణ, ప్రిన్సిపాల్ రాధిక, కార్పొరేటర్ గుండు చందన పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



సదస్సులో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

వరంగల్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ పూర్తి సహకారం అందిస్తుందని అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. మార్కెట్ యార్డులోని మినీ చాంబర్ కార్యాలయంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ వసుధ, జిల్లా చైల్డ్ ఆఫీసర్ శ్రీదేవి మాట్లాడుతూ బాల కార్మికులను పరిశ్రమలు, మిర్చి కల్లాల్లో పనికి నియమించుకోవడం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. మామునూరు ఏసీపీ తిరుపతి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ప్రివెన్షన్ యూనిట్ అధికారి వెంకన్న, ఎనుమాల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి నిర్మల, చాంబర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొట్టాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య


మాట్లాడుతున్న వెంకటయ్య

హసన్‌పర్తి: భారతరాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగ ఉత్సవాల్లో భాగంగా దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో శనివారం సదస్సు నిర్వహించారు. డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేశ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో వెంకటయ్య మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మానుకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ అన్యాయాలను ఎదిరించి హక్కుల అమలుకు ఉద్యమించాలని కోరారు. సమావేశంలో డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర కార్యదర్శి శంకర్, నాయకులు బాబురావు, ఎలేందర్, రవి, మంద వీరస్వామి పాల్గొన్నారు.

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ఎన్పీడీసీఎల్ యాజమాన్యంతో చర్చిస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ అతిథి గృహంలో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగులు కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

క్లుప్తంగా

తైక్వాండోలో అమృతవర్షిణికి గోల్డ్‌మెడల్



వరంగల్ స్పోర్ట్స్: బెంగళూరులో శనివారం జరిగిన వీఫా జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో హనుమకొండ వడ్డేపల్లి పరిమళ కాలనీకి చెందిన అమృతవర్షిణి గోల్డ్ మెడల్ సాధించింది. 6వ తరగతి చదువుతున్న ఆమె అండర్ –12 పూంసే విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. పరిమళ కాలనీలో కోచ్ నవీన్ వద్ద వర్షిణి మూడేళ్లుగా శిక్షణ పొందుతోంది.

బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌గా ప్రకాశ్



కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన కె.ప్రకాశ్‌ను బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా నియమించారు. ఈమేరకు ఆయనకు బీసీ మేధావుల వేదిక వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు శనివారం నియామక పత్రం అందజేశారు.

ఉత్తమ సూపర్‌వైజర్ అవార్డు అందజేత



మడికొండ: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మడికొండ గ్రామానికి చెందిన చింతపండు హరిప్రసాద్‌కు ఉత్తమ సూపర్‌వైజర్ అవార్డును వరంగల్ కలెక్టర్ సత్య శారద శనివారం అందజేశారు. ఖిలా వరంగల్ మండలంలో జూనియర్ అసిస్టెంట్‌గా హరిప్రసాద్ విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రైవేట్ కళాశాల ఎదుట ధర్నా

విద్యారణ్యపురి: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నడిపిస్తున్నారని ఆరోపిస్తూ హనుమకొండలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ అకాడమీల పేరుతో కళాశాలను ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లోనే పెట్టి నడుపుతూ విద్యార్థుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. సదరు కళాశాలపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ధర్నాలో సాయికుమార్, అజయ్, మల్లేష్, అభిషేక్, పవన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాలకు చేయూత



హసన్‌పర్తి: నగరంలోని అతిథి దివ్యాంగుల ఆశ్రమం, లార్డు అనాథాశ్రమాలకు హసన్‌పర్తి మండలం ఎల్లాపురంలోని ఎస్బీఆర్ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం చేయూతనందించారు. ఈమేరకు రూ.50 వేల విలువైన బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా ఎస్బీఆర్ పాఠశాల డైరెక్టర్ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ అనాథలను మానవత్వంతో ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు నరేష్, సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఖిలా వరంగల్: వరంగల్ జక్కలొద్ది క్రాస్ రోడ్డు వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అటు వెపు వెళ్తున్న మంత్రి కొండా సురేఖ.. క్షతగాత్రులను చూసి చలించిపోయారు. ఎంజీఎం ఆస్పత్రికి తరలించాలని ఆదేశించగా, ఏసీపీ నందిరాం నాయక్ వెంటనే క్షతగాత్రులను తన వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

కాజీపేట: కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎదురుగా శనివారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 70 ఏళ్ల వయస్సుగల ముస్లిం వ్యక్తి మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై శివకృష్ణ తెలిపారు.

పెరుగు కోసం వచ్చి.. మహిళ మెడలోని చైన్ లాగారు

హసన్‌పర్తి: ఇద్దరు యువకులు చైన్ స్నాచింగ్‌కు యత్నించిన ఘటన నగరంలోని గోపాలపురం సుభాష్‌నగర్‌కాలనీలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సుభాష్‌నగర్‌లో లలితకు చెందిన కిరాణం షాపు వద్దకు శనివారం రాత్రి బైక్‌పై ఇద్దరు యువకులు వచ్చి పెరుగు అడిగి, పెరుగు ప్యాకెట్లు ఇస్తున్న క్రమంలో ఆమె మెడలోని చైన్‌ను లాగారు. ఆ చైన్ వారి చేతిలో నుంచి కిందపడింది. ఈక్రమంలో ఆ మహిళ కేకలు వేయడంతో ఆ యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

డంపింగ్ యార్డ్ పొగపై మహిళల నిరసన


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న స్థానికులు

మడికొండ: డంపింగ్ యార్డ్ పొగపై స్థానిక మహిళలు నిరసన తెలిపారు. ఈమేరకు శనివారం రాత్రి విపరీతమైన పొగ వ్యాపించడంతో మడికొండ చౌరస్తాలో జాతీయ రహదారిపై వినాయకనగర్ వాసులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ పొగతో తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేయాలని కోరినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నంకావడంతో ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్ అక్కడికి చేరుకుని, వారికి నచ్చజెప్పి పంపించారు.

డంపింగ్ యార్డు అడ్‌హక్ కమిటీ సమావేశం

మడికొండ డంపింగ్ యార్డు అడ్‌హక్ కమిటీ సమావేశాన్ని 64వ డివిజన్ పెద్దమ్మ ఆలయం వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు హాజరై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈనెల 27వ తేదీన కలెక్టర్, జీడబ్ల్యుఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే, డంపింగ్ యార్డు వల్ల కలిగే సమస్యలపై స్థానిక ఎస్‌హెచ్‌ఓ కిషన్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్పన్ నాగరాజు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం, హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరగనున్న గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు.

క్రీడల్లో ‘ఎస్‌వీఎస్’ ప్రతిభ



హసన్‌పర్తి: జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో భీమారంలోని ఎస్‌వీఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నగరంలోని జరిగిన కబడ్డీ, చెస్ బాలిక విభాగంలో ఎస్‌వీఎస్ విద్యార్థినులు పాల్గొని ప్రథమ బహుమతి సాధించారని వివరించారు. అలాగే, బాలుర హైజంప్ విభాగంలో ప్రథమ స్థానం, కబడ్డీ బాలుర విభాగంలో ద్వితీయ స్థానం, బాలుర బ్యాడ్మింటన్‌లో, బాలికల విభాగంలో రన్నర్‌గా, బాలికల విభాగం వాలీబాల్, హైజంప్‌లో ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని తిరుమల్‌రావుతో పాటు పలువురు అభినందించారు.

హైకోర్టు జడ్జీలకు సన్మానం



వరంగల్ లీగల్: హైకోర్టు జడ్జీలుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ యారా రేణుక, జస్టిస్ నర్సింగరావు, జస్టిస్ ఈద తిరుమలాదేవిని వరంగల్ న్యాయవాదులు హైదరాబాద్‌లో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. న్యాయమూర్తులను కలిసిన వారిలో గుడిమల్ల రవికుమార్, ఆనందమోహన్, దయ్యాల సుధాకర్, గునగంటి శ్రీనివాస్, అల్లం నాగరాజు పాల్గొన్నారు.

పోటాపోటీ..



వరంగల్ అర్బన్: నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలో టేబుల్ టెన్నిస్‌లో శనివారం పోటీపోటీగా తలపడ్డారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగా టేబుల్ టెన్నిస్‌లో ఇద్దరూ తమ శక్తియుక్తులు ఒడ్డారు.

విద్యార్థులే దేశ భవిష్యత్ నిర్దేశకులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యేలు

ఖిలా వరంగల్: నేటి విద్యార్థులే దేశ భవిష్యత్ మార్గ నిర్దేశకులని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఐనవోలు మండలం పున్నేలు క్రాస్ రోడ్డు వద్ద ఏకశిల ఈ–టెక్నో స్కూల్ ప్రాంగణంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఏకశిల విద్యాసంస్థల వార్షికోత్సవం శనివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో బేతి కొండల్‌రెడ్డి, శివప్రసాద్, వీవీ రమణరెడ్డి, ప్రిన్సిపాల్ ఎండీ.బాబా, వైస్ ప్రిన్సిపాల్ రవికిరణ్, భిక్షపతి, దీపక్, లవకుమార్, మణికుమార్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

‘స్థానిక సంస్థల్లో లబ్ధి పొందడానికే సభలు’



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

వరంగల్ చౌరస్తా: గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, ఎన్నికల హామీలను ప్రచారం చేసుకొని, ప్రజలను మభ్యపెట్టి స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ, వార్డు సభలు జరుపుతోందని ఎంసీపీఐ (యూ) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆరోపించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో శనివారం జరిగిన పార్టీ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ తక్షణమే పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, నాయకులు ఐతం నాగేష్, ఎగ్గేని మల్లికార్జున్, అప్పన్నపూరి నరసయ్య, మాలి ప్రభాకర్, పరిమళ గోవర్ధన్ రాజు, రాయినేని ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పథకానికి ‘గుడిబడి’ ఎంపిక


వివరాలు వెల్లడిస్తున్న నాయకులు

వరంగల్: వరంగలో కాశిబుగ్గ నరేందర్‌నగర్ (గుడిబడి) ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానమంత్రి స్కూల్ ఆఫ్ రైజింగ్ ఇండియా పథకానికి ఎంపికయిందని బీజేపీ నేత సముద్రాల పరమేశ్వర్ తెలిపారు. కాశిబుగ్గలోని శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకంలో ఎంపికైన పాఠశాలకు ఐదేళ్ల కాలంలో సుమారు కోటి రూపాయలు, మౌలిక వసతుల కోసం ప్రతిఏటా రూ.20లక్షల చొప్పున కేంద్రం విడుదల చేస్తుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తారని అన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు రఘునారెడ్డి, జి.కుమార్‌యాదవ్, పోలెపాక మార్టిన్ లూథర్, సిద్దోజు శ్రీనివాస్, చింతం రాజు, కోట సతీష్, కందుకూరి శ్రీనివాస్, బొడ్డు రాకేశ్, మామిడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పేదరికం ఆటంకం కారాదు


విద్యార్థులతో సంతకాలు చేయిస్తున్న అనితారెడ్డి

విద్యారణ్యపురి: విద్యకు పేదరికం ఎప్పుడూ ఆటంకం కారాదని, సంపూర్ణ అక్షరాస్యతే వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ పోరాట లక్ష్యం అని ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్‌పర్సన్, కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి అన్నారు. ప్రపంచ విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని హనుమకొండలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు విద్య ప్రాధాన్యతను వివరించారు. అలాగే, విద్యార్థులతో సంతకాలు చేయిస్తూ సంతకం విలువను తెలిపారు. ప్రొటెక్షన్ జిల్లా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కేశవరెడ్డి, దీప, ప్రసన్న, కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలి


దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ శివకుమార్, నాయకులు

హసన్‌పర్తి: దరఖాస్తులు చేసుకున్న అర్హులందరికీ పథకాలు అందించాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కోరారు. ప్రజాపాలనలో భాగంగా 66వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని ముసాయిదా జాబితాల్లో పేర్లు రాని వారు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. అనంతరం దరఖాస్తుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఓటు ఎంతో విలువైంది


హన్మకొండ: ప్రతిజ్ఞ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు


కేయూలో మాట్లాడుతున్న పాస్ రాష్ట్ర అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్

కేయూ క్యాంపస్: ఓటు ఎంతో విలువైనదని, అర్హులంతా ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ రమేష్‌రాథోడ్ సూచించారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు.

ఓటు ఓ వజ్రాయుధం

కేయూ క్యాంపస్: ప్రజాస్వామ్యంలో ఓటు ఓ వజ్రాయుధం లాంటిదని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని కేయూలోని జర్నలిజం విభాగంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఏకశిల పార్కులో ఓటరు అవగాహన సదస్సు

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో శనివారం జాతీయ ఓటరు అవగాహన సదస్సును నిర్వహించారు. ఏకశిల వాకర్స్ అసోసియేషన్, ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చేద్దామని ప్రతినిధులు పిలుపునిచ్చారు.

ఓటు శక్తివంతమైనది

హన్మకొండ: ప్రజాస్వామ్యంలో ఓటు ఓ వజ్రాయుధం లాంటిదని, అత్యంత విలువైనదని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు సూచించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఖిలా వరంగల్: ఓటర్లు బాధ్యతాయుతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలంగాణ సామాజిక న్యాయవేదిక అధ్యక్షుడు సాంబయ్య యాదవ్ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వరంగల్ విద్యానగర్ కాలనీలో చాణిక్య విద్యానికేతన్ హైస్కూల్ ప్రాంగణంలో పాఠశాల కరస్పాండెంట్ అచ్చ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

సంక్షిప్తంగా

మహాధర్నా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట: ఫిబ్రవరి 3న హైదరాబాద్ రాష్ట్ర కార్మిక శాఖ అంజయ్య భవనం ఎదుట జరగనున్న మహాధర్నా వాల్‌పోస్టర్లను కాజీపేట పట్టణంలోని కార్మిక అడ్డాలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ కార్మికులతో కలిసి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంకెర్ల కుమారస్వామి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ జేరిపోతుల భిక్షపతి, చిక్కుడు సాయిలు, సతీష్, సంపత్ పాల్గొన్నారు.

రాగి జావా పంపిణీ

కాజీపేట రూరల్: కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్లలో, న్యూ శాయంపేటలో కుశాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాగి జావా పంపిణీ చేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా రాగి జావా పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుశాల్ తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు

హసన్‌పర్తి: వాకర్స్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమళ్ల సుధీర్ తెలిపారు. కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించి ఈసీజీ, డయాబెటిక్ పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షుడు బొక్క కుమార్, సూరయ్య, చంద్రశేఖర్, భాస్కర్, బోడ యుగంధర్, పుల్లా దుర్గారాం పాల్గొన్నారు.

లైఫ్ ఇన్సూరెన్స్ సంకల్పయాత్ర

నయీంనగర్: ఇన్సూరెన్స్ ఫర్ ఆల్ అనే నినాదంతో టాటా ఏఐఏ వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో హనుమకొండ పెట్రోల్ పంపు నుండి కేయూ క్రాస్ వరకు ఇన్సూరెన్స్ అడ్వైజర్లు, లీడర్లు, బ్రాంచ్ మేనేజర్లు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అడిషనల్ డీసీపీ ఎస్.రవి ప్రారంభించారు. అనంతరం, రతన్ టాటా స్ఫూర్తితో రెడ్ క్రాస్ సొసైటీ బాధ్యుడు ఇ.వి.శ్రీనివాస్ రావు ప్రారంభించిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు.

కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడికి సన్మానం

కాజీపేట రూరల్: 47వ డివిజన్ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియామకమైన వలిశెట్టి సాయినాథ్ పటేల్‌ను పార్టీ నాయకులు డీజిల్‌కాలనీ చౌరస్తాలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి పసునూరి మనోహర్, 47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, 63వ డివిజన్ అధ్యక్షుడు పోగుల సంతోష్, రాష్ట్ర బీసీ సెల్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.